## క్లుప్తంగా

### కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని 16వ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న వృద్ధురాలు లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ కుల్లాయ్ సోమవారం కర్నూలు ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందించారు.

### నేడు జగనన్న సురక్ష సదస్సు

సంజామల: మండలంలోని ఆకుమల్ల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష సదస్సు ఉంటుందని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారు ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల్లో మార్పులు తదితర 11 రకాల ప్రభుత్వ సేవలను అందించనున్నారన్నారు.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మంగళవారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు.

### సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

డోన్ టౌన్: సుప్రీం కోర్టు భవన నిర్మాణ కార్మికుల కోసం 1996లో ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయకులు విజ్ఞప్తి చేశారు. ఆగ్రాలో జరిగిన దేశ వ్యాప్త లేబర్ అధికారుల సమావేశానికి నిరసనగా సోమవారం కార్మికులతో కలిసి నిరసన తెలిపారు.

### నివాళి

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన తలుకూరి లక్ష్మి రెడ్డి (86)అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

### యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న హిమాలయ యోగి సదానందగిరి

బేతంచెర్ల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో యోగా, ధ్యానంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే గాకుండా మానసిక ప్రశాంతత లభిస్తుందని హిమాలయ యోగి సదానందగిరి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర పిరమిడ్ ధ్యాన మందిరం వార్షికోత్సవాన్ని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకులు భువనేశ్వరరాజు, మద్దయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


### మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సభ్యులు

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్ నారాయణం తులసి స్వప్న, ప్రో గ్రామ్ కోఆర్డినేటర్ కందగడ్డల మోహన్‌రావు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం పట్టణంలోని అమ్మవారి శాల ఆవరణంలో వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షులు బల్లాని సూర్య, ఉమాదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

### విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్

డోన్: శ్రీసుధ స్కూల్ విద్యార్థిని సుమలతకు ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ శాలిని రూ.8వేల ఆర్థిక సాయం చేశారు. నగదును మునిసిపల్ చైర్మన్ రాజేష్ చేతులమీదుగా విద్యార్థినికి అందజేశారు.

ప్యాపిలి: మండల పరిధిలోని సీతమ్మ తండాకు చెందిన విజయనాయక్ కొద్దిరోజుల క్రితం కోన జల పాతంలో జారి పడి మృతి చెందాడు. కుమారుడిని కోల్పోయి బాధలో ఉన్న తల్లి శంకరమ్మ బాయికి సోమవారం సీతమ్మ తండా డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువకులు రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా!

- రేషన్ బియ్యానికి బదులు రాగులు, జొన్నలు
- ఆరోగ్య ప్రయోజనాలపై దృష్టి
- రాగులు, జొన్నల్లో పలు పోషకాలు
- కార్డుదారులకు ఐదు కిలోల చొప్పున పంపిణీ
- 88 వేల కుటుంబాలకు లబ్ధి



ఎండీయూ ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ప్రజా పంపిణీ వ్యవస్థతో బియ్యం, చక్కెర, కందిపప్పు తదితర నిత్యావసరాలను మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్(ఎండీయూ) ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. రేషన్ లబ్ధిదారులకు మరింత మేలు చేసేందుకు రెండు నెలల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చిరుధాన్యాలను సరఫరా చేస్తోంది. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో 87,991 రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డులో ఉన్న ఒక్కో సభ్యుడికి 5 కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నారు. పేదల ఆరోగ్యానికి ధీమా కల్పిస్తూ కార్డుదారులకు బియ్యం కోటాను కాస్త తగ్గించి ఆ స్థానంలో పలు పోషకాలతో కూడిన ఐదు కిలోల రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నారు.

**పేదలకు ఆరోగ్య సిరులు**

ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం పేదలకు అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. కార్డుదారులకు ప్రతి నెలా మూడు కిలోల జొన్నలు, రెండు కిలోల రాగులు సరఫరా చేస్తున్నారు. చిరుధాన్యాలు ఆరోగ్య పరిరక్షణలో కీలకంగా మారాయి. చిరుధాన్యాల్లో ఎన్నో ఆరోగ్యకర లక్షణాలున్నాయి. శారీరక రుగ్మతలు, మానసిక ఒత్తిడి తగ్గడానికి ఆహారంలో భాగం చేసుకోవాలని శాస్త్రవేత్తలు సైతం చెబుతున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న రాగులు, జొన్నల్లో పలు రకాల పోషకాలున్నాయి. జొన్నలతో వండిన ఆహార పదార్థాలు సులభంగా జీర్ణమవడంతోపాటు జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. అధిక పీచు పదార్థం బరువును తగ్గించడానికి ఉపకరిస్తుంది. చర్మవ్యాధులను నివారిస్తుంది. రక్త ప్రసరణ పెరుగుతుంది. జొన్నల్లో బీకాంప్లెక్స్ విటమిన్లు అయిన ఫైరిడాక్సిన్, రైబోఫ్లావిన్, థయామిన్ అధికంగా ఉంటాయి. పొటాషియం, భాస్వరం, మెగ్నీషియం, జింకు ఖనిజ లవణాలు పుష్కలంగా లభిస్తాయి. రాగుల్లో అమినోయాసిడ్స్ ఆకలిని తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధి(షుగర్)కి రాగులతో చేసిన రాగిముద్ద, రాగిజావా తదితర ఆహార పదార్థాలు చక్కని ఔషధంగా పనిచేస్తాయి. పాలల్లోకంటే అధికంగా కాల్షియం రాగుల్లో ఉంటుంది. అధిక మోతాదులో ఉన్న కాల్షియంతో ఎముకలు బలంగా మారతాయి. పేదలకు ఆరోగ్య సిరులు అందిస్తుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ బియ్యానికి బదులు రాగులు, జొన్నలు సరఫరా చేయడం వల్ల రేషన్ అక్రమాలకు చెక్ పడింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం వ్యాపారులు పుట్టగొడుల్లా వెలిశారు. కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యాన్ని పడి రూ.10కి కొనుగోలు చేసి మిలర్ల సాయంతో రేషన్‌బియ్యాన్ని పాలిష్ చేసి కర్ణాటక, చెన్నై రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌తో వ్యాపారం చేస్తున్నారు. పాలిష్ చేసిన బియ్యాన్ని తిరిగి ప్రజలకే కిలో రూ.20 ప్రకారం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 60 శాతం మంది కార్డుదారులు రేషన్ బియ్యాన్ని వినియోగిస్తుండగా మిలిగిన కార్డుదారుల నుంచి దళారులు బియ్యం కొనుగోలు చేస్తూ దందా కొనసాగిస్తున్నారు. రాగులు, జొన్నల పంపిణీ ద్వారా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది.

| లబ్ధి పొందుతున్న కార్డుదారుల వివరాలు | |
|---|---|
| మండలం | రేషన్‌కార్డులు |
| బనగానపల్లె | 30,567 |
| కోవెలకుంట్ల | 13,628 |
| కొలిమిగుండ్ల | 15,882 |
| అవుకు | 15,720 |
| సంజామల | 12,214 |

### ఆరోగ్యానికి మేలు



ప్రజా పంపిణీ ద్వారా బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు అందజేస్తున్నారు. రెండు నెలల నుంచి వీటితోపాటు బియ్యం కోటాను తగ్గించి జొన్నలు, రాగులు సరఫరా చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చిరుధాన్యాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతోంది.

– లింగమయ్య, కార్డుదారుడు, కోవెలకుంట్ల

### చిరుధాన్యాల రైతులకు ప్రోత్సాహం



ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జొన్నలు, రాగులు పంపిణీ చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ మరో వైపు చిరుధాన్య రైతులను ప్రోత్సహిస్తోంది. చిరుధాన్యాల దిగుబడులను రైతుల నుంచి కొనుగోలు చేస్తుండటం మంచి పరిణామం. నాకున్న రెండు ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని జొన్న, మినుము, సజ్జ పంటలు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నాను.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

# భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు



కోవెలకుంట్ల సాయిబాబా ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



యర్రగుడిలో సాయి సత్యవత్రాన్ని వింటున్న అశేష భక్త జనం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గుంజలపాడు రహదారిలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాకు కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, సామూహిక సత్యవ్రతం, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గుళ్లదూర్తి, భీమునిపాడు, జోళదరాశి, లింగాల, వెలగటూరు తదితర గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా కొనసాగాయి.

బనగానపల్లె రూరల్: మండల కేంద్రంలోని యాగంటిపల్లె రహదారిలో ఉన్న షిరిడీ సాయిబాబా, అవుకు రోడ్డులో ఉన్న బాబా మందిరం, ఆంజనేయ స్వామి ఆలయంలోని షిరిడీ సాయినాథ్ మందిరాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మండలంలోని మిట్టపల్లి, కైప, ఎర్రగుడి తదితర గ్రామాల్లోనై గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సాయిబాబా ఆలయాలు సాయి నామ సంకీర్తనలతో మార్మోగిపోయాయి. కొలిమిగుండ్లలో షిర్డీసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మైన్స్ అండ్ జియాలజీ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రగుడిలోని సాయి గీతామందిరంలో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డోన్: పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా దేవాలయాల్లో వివిధ రకాల పుష్పాలతో స్వామి వార్లను అలంకరించడంతో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక మాలిక్ బాబా సంస్థాన్‌లో శిరిడిసాయి, మాలిక్‌బాబా విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. కర్నూలు రోడ్డులోని దత్తాత్రేయ స్వామి గుడిలో కూడా వందలాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించుకున్నారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మల ఆధ్వర్యంలో వేడుకగా జరుపుకున్నారు.

బేతంచెర్ల: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఆలయ కృపాధామ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణం నుంచే గాక సిమెంట్‌నగర్, బుగ్గానిపల్లె, కొలుములపల్లె ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే సరస్వతి శిశుమందిర్ లోనూ గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

# న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోవెలకుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. డోన్ కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్‌నాయుడిపై కొందరు వ్యక్తులు చేసిన దాడిని ఖండిస్తూ కోవెలకుంట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసీంసాహెబ్ ఆధ్వర్యంలో కోర్టు గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ ఓబులేసు, సీనియర్ న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, బాలమురళీకృష్ణ, ప్రేమ్‌నాథ్, ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, విద్యాసాగర్, విష్ణు మనోహర్‌రెడ్డి, రమేష్, శ్రీకాంత్, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

### వికసించిన మే పుష్పం



కోవెలకుంట్ల గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న వలంటీర్ సుమలత ఇంటి ఆవరణలో మే పుష్పం వికసించింది. నాలుగేళ్ల నుంచి మొక్కను పెంచుతుండగా మొదటి ఏడాది మేలో వికసించింది. మూడేళ్ల తర్వాత రెండు రోజుల క్రితం పుష్పం వికసించినట్లు సుమలత తెలిపారు.

– కోవెలకుంట్ల

### ఘనంగా క్రైస్తవుల దినోత్సవం

డోన్: క్రైస్తవ దినోత్సవాన్ని సోమవారం గుత్తి రోడ్డులోని సమైక్య క్రైస్తవ మైనార్టీ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోసిప్ రాయలసీమ జోనల్ చైర్మన్ బందెల రాజును సన్మానించారు. అలాగే నల్లగుట్ట హోసన్నా వృద్ధాశ్రమంలోనూ క్రైస్తవ దినోత్సవాన్ని వృద్ధులు ఘనంగా నిర్వహించుకున్నారు.

### రేపు కార్యాలయాల ప్రారంభం

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లిలో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకుతో పాటు సచివాలయ, రైతుభరోసా కేంద్రం కార్యాలయాను ఈనెల 5న ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

# ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ముక్కమల్ల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ శీలారెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ కనక రమాదేవి, కోవెలకుంట్ల వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీఓ నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలకు పెద్దపీట

- జీసీ ఆరోపణల్లో నిజం లేదు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ముస్లింలు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

బనగానపల్లె: తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే పట్టణంలోని ముస్లింలకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాతబస్టాండ్‌లోని ఉర్దూ భవన్ ప్రాంతంలో షాదీఖానా ఏర్పాటుకు తాను అడ్డుపడుతున్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. కేవలం ముస్లిం ఓట్ల కోసమే 2019 ఫిబ్రవరిలో షాదీఖానాకు బీసీ జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. ముస్లిం కమిటీ కాంట్రిబ్యూషన్ డబ్బు రూ.30 లక్షలను టీడీపీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు చూపి మోసం చేశారన్నారు. ఆ తర్వాత వాటిని కూడా ఆయనే డ్రా చేసుకున్నారన్నారు. తాను మొదటిసారిగా 2009లో ఎమ్మెల్యే అయిన తరువాత పట్టణంలో ఈద్గా స్థలం అన్యాక్రాంతం కాకుండా రూ.30 లక్షలతో ప్రహరీ నిర్మించానన్నారు. ఇటీవల ముస్లిం శ్మశానవాటిక స్థలం అన్యాక్రాంతం కాకుండా మరో రూ.69 లక్షలతో ప్రహరీ నిర్మించినట్లు చెప్పారు. అవుకు మెట్ట వద్ద షియా మతస్తుల స్థలంలో రూ.40 లక్షల సొంత నిధులతో చేపట్టిన ఇబాదత్‌ఖానా నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఇక షాదీఖానా నిర్మాణానికి తమ ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. పట్టణంలోని మెజార్టీ ముస్లింల అభిప్రాయం మేరకు ఏ ప్రాంతంలో నిర్మించాలో నిర్ణయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అంతకు ముందు ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ పట్టణ సమీపంలోని యాగంటి రహదారిలో ఉన్న ఎస్‌ఆర్‌బీసీ సమీపంలో షాదీఖానా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్థానిక ఉర్దూ భవన్ స్థలాన్ని అక్రమణాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సమావేశంలో ఎంపీడీఓ శివరామయ్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, అత్తార్‌జాహెద్‌హుస్సేన్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మహబూబ్‌వలి, జమాతే ఇస్లామిక్ సభ్యులు షబ్బీర్‌హుస్సేన్, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

### శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శాఖాహార సద్భావన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: శాఖాహారంలో సంపూర్ణ ఆరోగ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. స్పిరిచువల్ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శాఖాహార సద్భావన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆధునిక జీవనంలో ప్రతి ఒక్కరూ అనేక సమస్యలు, ఒత్తిళ్లతో బాధపడుతున్నారన్నారు. వీటన్నిటినీ ధ్యానంతో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాథంశెట్టి వేణుగోపాల్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ రామ్‌నాథ్, పిరమిడ్ సేవాదల్ రాష్ట్ర ఇన్‌చార్జ్ బండి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జ్ రాజశేఖర్, లీగల్ సెల్ అడ్వైజర్ మాధవీ, ధ్యాన పిరమిడ్ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### శాకంబరిగా మహాలక్ష్మి అమ్మవారు



బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆశాడ మాసం పౌర్ణమిని పురస్కరించుకు స్వామి వారి దేవేరి అయిన మహాలక్ష్మి అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

### చౌడేశ్వరిదేవికి సహస్ర దీపాలంకరణ సేవ



చౌడేశ్వరిదేవి ఉత్సవవిగ్రహానికి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి సోమవారం సహస్రదీపాలంకరణ సేవను ఘనంగా నిర్వహించారు.

### సన్మానం



డోన్: జగనన్న సచివాలయాల మండల కన్వీనర్‌గా నియమితులైన మల్లెంపల్లె రామచంద్రుడిను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సోమవారం ఘనంగా సన్మానించారు. అంతకుముందు మోటార్‌సైకిళ్లతో వ్యవసాయ మార్కెట్ నుంచి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు.

### ఉపాధ్యాయులను నియమించాలి

బేతంచెర్ల: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని హెచ్ కొట్టాల గ్రామస్తులు సోమవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. 1 నుంచి 8 తరగతుల వరకు 120 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో తమ పిల్లలకు చదువు ఎలా చెబుతారని, ఉన్నతాధికారులు స్పందించి అదనపు ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు.

## క్రైం కార్నర్

**తండ్రిపై కుమారుడి దాడి**

బేతంచెర్ల: స్థానిక కొత్తబస్టాండు సమీపంలో బనగానపల్లె పట్టణానికి చెందిన పల్లెపు మద్దయ్యపై కుమారుడు మణికాంత్ దాడి చేసి గాయపరిచాడు. మద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్‌నాయక్ సోమవారం తెలిపారు.

**మహిళపై దాడి**

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో పొలం తగాదా విషయమై వడ్డె రాజ్యలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన జయమ్మ, లక్ష్మన్న, మధు, సుభాషిణి, శేఖర్, పుల్లయ్య దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య సోమవారం తెలిపారు.

**మట్కా బీటర్ల అరెస్ట్**

డోన్ టౌన్: పట్టణంలో వేర్వేరు చోట్ల మట్కా రాస్తున్న చాకలి మల్లికార్జున,బియ్యం ప్రసాద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.40 వేల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ సోమవారం తెలిపారు.

**నాటుసారా స్వాధీనం**

అవుకు: మండల పరిధిలోని టెక్కే స్వామి దర్గా సమీపంలోని కొండలో సోమవారం 70 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.ఇస్రానాయక్ తండాకు చెందిన సుగాలి గోపాల్ నాయక్ వద్ద నుంచి రామాపురం గ్రామానికి చెందిన ఈడిగ శివమ్మ, ఈడిగ నాగేంద్ర, నాగభూషి, చెర్లోపల్లె గ్రామానికి చెందిన ఈడిగ సంజమ్మ, తెలుగు నారాయణమ్మ, అవుకు చెందిన రసూల్ బాషా లు నాటుసారా కొనుగోలు చేసి అమ్ముకోవటానికి తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**24 మందిపై బైండోవర్**

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన 24 మందిపై సోమవారం బైండోవర్ కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. గతంలో నాటుసారా విక్రయించే వారని, ముందస్తు చర్యల్లో భాగంగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

**మద్యం విక్రేత అరెస్ట్**

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన ఈడిగ నాగేశ్వరరావు గౌడ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్‌నాయక్ సోమవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో నిఘా వేసి ఉంచగా ఆర్‌ఎస్ రంగాపురం నుంచి గూటుపల్లెకు మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా అరెస్ట్ చేశామన్నారు.

**నాటు సారా విక్రేతలు..**

కోవెలకుంట్ల:స్థానిక ముదిగేడు రహదారిలో నాటుసారా విక్రయిస్తున్న ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పెద్దయ్య,వెంకటనారాయణ,తిరుపాలయ్య, నాగరాజు,రమణ,భీమునిపాడుకు చెందిన నారాయణ రాంగోపాల్‌రెడ్డిలు మట్కా నిర్వహణతోపాటు సారా విక్రయిస్తుండటంతో అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి 35 లీటర్ల నాటుసారా,రూ.1,550 నగదు,మట్కా చీటలు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

**విద్యార్థికి గాయాలు**

డోన్ టౌన్: లక్ష్మంపల్లె- మల్లెంపల్లె గ్రామాల మధ్య సోమవారం బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో లక్ష్మంపల్లెకి చెందిన ఓబులేసు కుమారుడు కార్తీక్‌కు గాయాలయ్యాయి. విద్యార్థిని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ వెంకటరెడ్డి హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షల కారణంగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భంలోని శిశువు ఆరోగ్యం కోసం మాత్రమే నిబంధనల ప్రకారం చేయాలన్నారు. నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ ఇంతియాజ్‌ఖాన్, స్కానింగ్ సెంటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

**స్పందన అర్జీలు పరిష్కరిస్తాం**

స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆర్డీఓ వెంకటరెడ్డి బాధితులకు హామీ ఇచ్చారు.సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. ఆయన వాటిని సంబంధిత శాఖలకు రెఫర్ చేసి, త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.